**విలేఖర్లు కావలెను**

జ్యోతి ప్రభంజనం దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో జిల్లాలకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్‌లు, ఆర్ సి ఇన్చార్జ్‌లు, మండల రిపోర్టర్‌లు కావలెను.

**సంప్రదించ వలసిన నెంబర్:**
**7095999737,9908103501**



PRGI NO:TGTEL/26/A6501

# జ్యోతి ప్రభంజనం

తెలుగు దిన పత్రిక

సంపుటి :01 సంచిక:02 ఎడిటర్: రాపోలు లింగస్వామి 02 -09 -2026 బుధవారం

Printed/:Rangareddy , Published By: Hyderabad , Nalgonda, Rangareddy, Mahaboobabad, Medak,worangal,Nizamabad, Adilabad,Karimnagar,Kammam, పేజీలు:4 వెల: 2-00


## రాహుల్ గాంధీపై ఆ కేసు నమోదు..

## కేంద్రంపై మంత్రి జూపల్లి ధ్వజం

నాగర్ కర్నూల్ జిల్లా,: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయించడం కేంద్ర ప్రభుత్వ దుశ్చర్య అని తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మత రాజకీయాలకు తెర లేపారని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి అవకాశాలు వచ్చిన సోనియాగాంధీ కుటుంబం తీసుకోలేదని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టినందుకు.. నిరసనగా మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రం అంబేడ్కర్ చౌరస్తా వద్ద గంటసేపు రోడ్డుపై బైఠాయించి మంత్రి జూపల్లి కృష్ణారావు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడారు.రాహుల్ గాంధీ భారత్ జోడోయాత్ర నిర్వహించి దేశ ప్రజలను చైతన్యం చేశారని మంత్రి జూపల్లి ప్రస్తావించారు. అలాంటి కుటుంబంపై ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయడం దుశ్చర్యగా భావిస్తున్నామని అన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే.. ఉత్తరప్రదేశ్‌లోని అల్ది హల్ద్వానిలోని ర్యాలీ వేదికను ఎక్కారని.. శుద్ధి చేసిన వారిపై కేసు నమోదు చేయకుండా.. ఆ విషయాన్ని ప్రశ్నించిన రాహుల్ గాంధీపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టడమేంటని ప్రశ్నించారు. 'మోదీ హటావో దేశ్‌కి బచావో.. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అని మంత్రి జూపల్లి కృష్ణారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌లో హైడ్రామా..

## కొండా సురేఖ ఢిల్లీ పర్యటన



హైదరాబాద్, సెప్టెంబర్ 1 తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ హై కమాండ్ దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో నామినేటెడ్ పదవుల భర్తీపై కూడా కాంగ్రెస్ హై కమాండ్ నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే తెలంగాణ కాంగ్రెస్ కీలక నేతలు వరుసగా మంగళవారం ఢిల్లీ బాట పట్టారు. ఈ నేపథ్యంలోనే ఢిల్లీకి మంత్రి కొండా సురేఖ చేరుకున్నారు. సురేఖతో పాటు ఢిల్లీకి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కూడా వెళ్లారు.

మంత్రి పదవి నుంచి తప్పిస్తారా..?

అయితే, మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత ఇటీవల ఓ కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. ఈ వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ హై కమాండ్ ఈ వ్యాఖ్యలపై సీరియస్ అయింది. ఈ విషయంపై అధిష్ఠానం గరంగరంగా ఉంది. ఈ క్రమంలోనే సురేఖకు ఢిల్లీ నుంచి పిలుపురావడం ఉత్కంఠగా మారింది. ఆమెను మంత్రి పదవి నుంచి తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అగ్రనేత మల్లికార్జునఖర్గే అపాయింట్‌మెంట్‌ను ఆమె కోరారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు

## హైకోర్టులో ఊరట



హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు రాష్ట్ర హైకోర్టులో ఊరట లబించింది. శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలంటూ సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. దీనిపై రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆ పిటిషన్‌పై నేడు విచారణ జరిగింది. హైడ్రా కమిషనర్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సిజె జస్టిస్ రాజీవ్ శక్దర్ వాదనలు వినిపించారు.

## ప్రశ్నిస్తే ఎఫ్‌ఐఆర్‌లతో

## రాజకీయ ప్రతీకారం

ఎన్ని ఎఫ్ఐఆర్‌లు పెట్టినా సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ చేసే పోరాటాన్ని ఎవరూ ఆపలేరని ఇరిగేషన్ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్నది కేవలం కాంగ్రెస్, బిజెపిల మధ్య అధికార పోరాటం కాదని, రాజ్యాంగం ప్రసాదించిన సమానత్వానికి సామాజిక వివక్షకు మధ్య, ప్రజాస్వామ్య ప్రశ్నకు అధికార దమనానికి మధ్య జరుగుతున్న సైద్ధాంతిక సంఘర్షణ అని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రసంగించిన వేదికపై అనంతరం నిర్వహించిన 'శుద్ధీకరణ' కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలోని అత్యున్నత దళిత నాయకుల్లో ఒకరైన ఖర్గే ప్రసంగించిన వేదికను ఆ తర్వాత 'శుద్ధి' చేయాల్సిన ప్రదేశంగా చిత్రీకరించడం ఒక వ్యక్తికి జరిగిన అవమానం మాత్రమే కాదని, తరతరాలుగా వివక్ష, సామాజిక వెలివేత, అవమానాలను ఎదుర్కొన్న కోట్లాది దళితులఆత్మగౌరవం పై జరిగిన దాడిగా భావించాల్సి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా ఇటువంటి సామాజిక వివక్షకు భారతదేశం సాక్షిగా నిలవాల్సి రావడం అత్యంత దురదృష్టకరమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఆగస్టు 8వ తేదీన హల్ద్వానీ రామ్‌లీలా



మైదానంలో జరిగిన 'విజయ్ శంఖనాథ్' బహిరంగ సభలో మల్లికార్జున ఖర్గే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వ వైఫల్యాలపైనే ప్రసంగించారని ఉత్తమ్ గుర్తు చేశారు.ఖర్గే ఏ మతాన్నీ, ఏ వర్గాన్నీ ప్రస్తావించలేదని, ఎవరికీ వ్యతిరేకంగా మాట్లాడలేదని ఆయన తెలిపారు. అయితే సభ జరిగిన రెండు రోజుల తర్వాత అదే వేదికపై శ్రీరామ్ సేన ధర్మార్థ సేవా న్యాస్కు చెందిన సభ్యులు 'శుద్ధీకరణ' హవనం నిర్వహించారని ఆయన పేర్కొన్నారు. అవమానించిన వారిని వదిలేసి ప్రశ్నించిన రాహుల్‌పై కేసులు పెట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఘటన కంటే దానిపై అధికార వ్యవస్థ స్పందించిన తీరు మరింతగ్ర్భాంతి కరమని ఉత్తమ్ మండిపడ్డారు.

### సెక్షన్ 30 రైతు సదస్సు మీద

## ఏ బేసిస్ మీద పెడుతారు

**: ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్**



డీజీపీ సీవీ ఆనంద్ ఒక సెంచరీ కొట్టినందుకు చాలా సంతోషం.. రేవంత్ రెడ్డి అక్రమ ఆదేశాలు అమలు చేయడంలో కూడా డీజీపీ డబుల్ సెంచరీ కొట్టేలాగా ఉన్నారని బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. సెప్టెంబర్ 3వ తారీఖున బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మిర్యాలగూడలో రైతు సదస్సు పెట్టాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లమోతు భాస్కర్ రావు దరఖాస్తు చేస్తే వెంటనే డీఎస్పీ వెంటనే అనుమతి తిరస్కరించిన్నారు. మీరు గతంలో సరూర్ నగర్ స్టేడియంలో జరిగిన యువ సంగ్రామ సదస్సులో ట్రాఫిక్‌గా అంతరాయం కలగకుండా చూసుకుంటాము అని చెప్పిన తర్వాత కూడా మేమే వాలంటీర్లను పెట్టుకుని ట్రాఫిక్‌ను మేమే మేనేజ్ చేసుకుంటామని చెప్పాం.. గత నెలలో బీఆర్ఎస్ యువ సంగ్రామ సదస్సు కోసం పర్మిషన్ నిరాకరిస్తే హైకోర్టుకి వెళ్లి అనుమతి తెచ్చుకున్నాం. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో, పండగల ఊరేగింపు సమయంలో పెట్టాల్సిన సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ పెడుతారు. అలాంటి సెక్షన్ 30 కేటీఆర్ రైతు సదస్సు మీద ఏ బేసిస్ మీద పెడుతారని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. ఈ రాష్ట్రంలో డిసెంబర్ 7, 2023 నుండి అప్రకటిత కర్ఫ్యూ అమలు చేస్తున్నారు. మొన్న కూడా హరీశ్ రావు పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడుతాను అంటే హౌస్ అరెస్ట్ చేశారని ఫైర్ అయ్యారు. మా నాయకులను పెళ్లికి, ఆసుపత్రికి, చివరికి చావుల దగ్గరికి కూడా పోనివడం లేదని మండిపడ్డారు.

## కాంగ్రెస్ ఉచిత ఉల్లిగడ్డల పంపిణీలో ఉద్రిక్తత

ఉచిత ఉల్లిగడ్డల పంపిణీలో ఉద్రిక్తత పరిస్థితులు చోటు



చేసుకున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1000 రోజులు పూర్తవడంతో వరంగల్‌లో కాంగ్రెస్ నేత రాజనాల శ్రీహరి ఉచిత ఉల్లిగడ్డ పంపిణీ చేశారు. దీంతో ఒక్కసారిగా జనం ఉల్లిగడ్డల కోసం ఎగబడ్డారు. ఉల్లిగడ్డలు తీసుకునేందుకు ఒకరినొకరు తోసుకోవడంతో గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇదే క్రమంలో సదరు కాంగ్రెస్ నేత అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

## ఎటిఎఫ్, కమర్షియల్ గ్యాస్ ధర పెంపు

విమాన ఇంధనం (ఏటీఎఫ్) ధరలను మంగళవారం 5.46 శాతం పెరిగింది.హోటళ్లు,రెస్టారెంట్లుతదితర వాణిజ్య సంస్థలు వినియోగించే 19 కిలోల వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ ధరను కూడా రూ.9.50 పెంచుతూ గ్యాస్ కంపెనీలు నిర్ణయించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో సంబంధిత ఇంధన ధరలు పెరగడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు వెల్లడించాయి. దేశీయ విమానయాన సంస్థలకు సరఫరా చేసే జెట్ ఇంధనం ధరను లీటరుకు రూ.6.28 పెంచి రూ.121.28కు చేర్చారు. అంటే ఏటీఎఫ్ ధరలో 5.46శాతం పెరుగుదల నమోదైంది. ఆగస్టు 1న కూడా ఏటీఎఫ్ ధరను లీటరుకు రూ.5 పెంచిన విషయం తెలిసిందే.వరుసగా రెండో నెల ఏటీఎఫ్ ధర పెరగడం విమానయాన సంస్థలపై ఆర్థిక భారాన్ని మరింత పెంచనుంది. విమాన సంస్థల నిర్వహణ వ్యయంలో ఏటీఎఫ్ వాటా 40 శాతం వరకు ఉంటుంది.

## పెంకుటింటికి రూ.1.43 లక్షల కరెంట్ బిల్లు..

ములుగు:పెంకుటింట్లో నివాసంఉంటున్న ఓ కుటుంబానికి ఏకంగా దాదాపు లక్షన్నరకరెంటు బిల్లువచ్చిన ఘటన ములుగు మున్సిపాలిటీ పరిధిలోని ప్రేమ్‌నగర్‌లో చోటు చేసుకుంది. తాము ఐదేళ్లుగా



వేరే చోట కిరాయికి ఉండేవాళ్లమని,గత 8నెలల నుంచే ఈ ఇంట్లో ఉంటున్నామని యజమాని కొమ్మినేని ప్రమీల తెలిపారు. అప్పటి నుంచి కరెంటు బిల్లు రాలేదని, గత నెల మొత్తం రూ.1,43,136 బిల్లు వచ్చిందన్నారు.తమ ఇంట్లో రెండు ఫ్యాన్లు, టివి, ఫ్రిడ్జితో పాటు మూడు ఎల్ఇడి బల్బులు మాత్రమే ఉన్నాయన్నారు. బిల్లు మొత్తం చెల్లించాలని అధికారులు ఒత్తి చేస్తున్నట్లు ప్రమీల ఆవేదన వ్యక్తం చేశారు.

## ప్రజా పాలన కాదు.. దోపిడి పాలన

రాష్ట్రంలో ప్రజా పాలనకాదు.దోపిడి పాలన కొనసాగుతున్నదని బిజెపి ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ధ్వజమెత్తారు.కాంగ్రెస్ పాలనతో విసిగిపోయిన ప్రజలు తమ పార్టీ వైపు చూస్తున్నారని ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని,ప్రజల ఆశలపై పూర్తిగా నీళ్లు చల్లిందని ఆయన తూర్పారపట్టారు.రాష్ట్ర ప్రజల కోసం పోరాడుతాం, వారి వెంట ఉంటాం అన్నారు. రైతు భరోసా అరకొర ఇచ్చారని, నకిలీ విత్తనాలు, సకాలంలో యూరియా అందించక అభాసుపాలయ్యారని, వ్యవసాయ కూలీలకు 12 వేలు ఇస్తామని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఆయన విమర్శించారు.ఉచిత వైద్యం పచ్చి బోగస్ అని తేలిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు తెలియకుండా డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ఆయన విమర్శించారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్ ఏమైందన్నారు. నోటిఫికేషన్ అడిగితే లాఠీ చార్జి, ఉద్యోగాలు అడిగితే అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్‌లకు తరలిస్తారని ఆయన తూర్పారపట్టారు. విదేశాలు తిరిగే ఏఐసిసి అగ్ర నేత రాహుల్ గాంధీకి చిక్కడపల్లి లైబ్రరీ గుర్తు రావడం లేదన్నారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలు తెలుసుకోవడానికి చిక్కడపల్లి లైబ్రరీ వద్దకు రావాలని ఎంపీ లక్ష్మణ్ డిమాండ్ చేశారు.

# సంపాదకీయం

## వెయ్యి రోజుల ప్రజాపాలన!

తెలంగాణ ప్రజల ఆకాంక్షలు, ఆశయాలు,ఆత్మగౌరవాన్ని పాలనకు కేంద్రబిందువుగా చేసుకుని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను విజయవంతంగా పూర్తి చేసుకుంది. ఈ వెయ్యి రోజులు కేవలం క్యాలెండర్లో గడిచిన రోజులు కావు.తెలంగాణ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన నిర్ణయాలకాలం.యువతకు ఉద్యోగాలు,రైతుకు భరోసా, మహిళలకు ఆర్థిక స్వావలంబన, పేదలకు గౌరవప్రదమైన జీవనం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులు? ఇవన్నీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్లాలన్నదే ప్రజా ప్రభుత్వ లక్ష్యం. ప్రభుత్వం ఏర్పడిన కొద్ది గంటల్లోనేఅమలు చేసిన మహాలక్ష్మి పథకం ఇందుకు నిదర్శనం. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించడం ద్వారా కోట్లాది మందిమహిళలకు ఆర్థిక ఉపశమనంలభించింది. ఇప్పటి వరకు 345 కోట్లకు పైగా ఉచిత ప్రయాణాలు జరిగి, మహిళలు సుమారురూ.12,075కోట్ల ప్రయాణ వ్యయాన్ని ఆదా చేసుకున్నారు.ఈ పథకం విజయవంతం కావడంతో పెరిగిన ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ఆర్టీసీని బలోపేతం చేయడంపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొత్త బస్సుల కొనుగోలు, ఆధునిక బస్ స్టేషన్ల నిర్మాణం, కొత్త డిపోల ఏర్పాటు, ఉద్యోగ నియామకాలు,ఉద్యోగుల సంక్షేమంవంటి అనేక చర్యలతో ఆర్టీసీని ప్రజలకు నమ్మకమైన ప్రజా రవాణా సంస్థగా తీర్చిదిద్దింది. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమంలోనూ ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. 2013 నుంచి పెండింగులో ఉన్న రూ.280కోట్ల బాండ్లను క్లియర్ చేయడం; 2017, 2021 పే స్కేల్ సమస్యలను పరిష్కరించడం; 11వ పీఆర్సీ అమలు;పెండింగులో ఉన్న డీఏల విడుదల; పీఎఫ్, సీసీఎస్ బకాయిల తగ్గింపు వంటి చర్యలు ఉద్యోగుల్లో నూతన విశ్వాసాన్ని నింపాయి.తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు రైతు వెన్నెముక. ప్రజా ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేసి 25 లక్షలకు పైగా రైతు కుటుంబాలను రుణభారం నుంచి విముక్తి చేసింది.రైతు భరోసా కింద రూ.36వేల కోట్లకు పైగాపెట్టుబడి సాయం అందించింది.సన్నవడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్, ఉచిత విద్యుత్, రైతు బీమా, పంట నష్టపరిహారం వంటి కార్యక్రమాలతో రైతుకు ప్రభుత్వం అండగా నిలిచింది. ధాన్యం కొనుగోళ్లలోనూ తెలంగాణ కొత్త రికార్డులు సృష్టించింది.సంక్షేమం అంటే కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదు; ఒక కుటుంబానికి విద్యుత్ భారం తగ్గించడం, వంటగ్యాస్ ఖర్చును తగ్గించడం, నాణ్యమైన బియ్యం అందించడం, ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించడం? ఇవన్నీ కుటుంబ జీవన ప్రమాణాలను మెరుగుపరిచే చర్యలే. ప్రభుత్వం గృహజ్యోతి ద్వారా 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇచ్చింది. దాదాపు 43 లక్షల కుటుంబాలకు రూ.500కే గ్యాస్ సిలిండర్ అందుతోంది. 15 లక్షలకు పైగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసి, మరింత మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకువచ్చింది. రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం అందించే కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా అర్హులైన పేదలకు సొంత ఇంటి కలను నిజం చేసే దిశగా అడుగులు వేస్తున్నది.మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థలో భాగస్వాములుగా చేసేందుకు స్వయం సహాయక సంఘాలకు భారీగా బ్యాంకు లింకేజీ కల్పించడం; వడ్డీ రాయితీలు ఇవ్వడం; పాఠశాల యూనిఫాంలు, చీరల తయారీ, పెట్రోల్ బంకుల నిర్వహణ, ఆర్టీసీ బస్సుల యాజమాన్యం వంటి కొత్త ఆదాయ మార్గాలను ప్రభుత్వం కల్పించింది.సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేను పూర్తి చేసింది ప్రజాప్రభుత్వం. బీసీలకు విద్య, ఉద్యోగాలు, రాజకీయాల్లో 42శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభ ఆమోదించి కేంద్రానికి పంపింది. ఎస్సీ ఉపకులాల వర్గీకరణను అమలుచేయడం ద్వారా సామాజిక న్యాయంలో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించింది.ఎస్సీ,ఎస్టీ,బీసీ,మైనారిటీసంక్షేమానికి రాష్ట్ర మొత్తం వ్యయంలోగణనీయమైన వాటాను కేటాయిస్తున్నది.ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడం, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పోషకాహారం అందించడం, కొత్త రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయడం, ఉపాధ్యాయ నియామకాలను చేపట్టడం ద్వారా విద్యా రంగంలో సమగ్ర మార్పులకు ప్రజా ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మెగా డీఎస్సీ ద్వారా 10,006 మంది ఉపాధ్యాయుల నియామకం జరిగింది.యువత ఆశలు,ఆకాంక్షలకు అనుగుణంగా 72వేలకు పైగా ప్రభుత్వ ఉద్యోగనియామకాలు చేపట్టింది ప్రభుత్వం. ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా కొత్త అవకాశాలను కల్పిస్తున్నది. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్, టీ?హబ్, టీ?వర్క్స్, వీ?హబ్ వంటి సంస్థల ద్వారావేలాది మంది యువతకుఆధునిక నైపుణ్య శిక్షణ అందుతోంది.తెలంగాణను పెట్టుబడుల అనుకూల రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం పారిశ్రామిక విధానాల్లో సంస్కరణలు చేపట్టింది. టీజీ?ఐపాస్ ద్వారా వేలాది పారిశ్రామిక యూనిట్లకు అనుమతులు ఇచ్చి భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేసింది. లైఫ్ సైన్సెస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డేటా సెంటర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అడ్వాన్స్‌డ్ మాన్యుఫాక్చరింగ్ వంటి భవిష్యత్ రంగాల్లో తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ పెట్టుబడులకు కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నది.ప్రజా ప్రభుత్వం కేవలం ప్రస్తుత సమస్యలకు పరిష్కారాలు చూపడం మాత్రమే కాదు; వచ్చే తరాల తెలంగాణను నిర్మించేందుకు దీర్ఘకాలిక లక్ష్యాలను నిర్దేశించింది.

## సక్రమంగా విధులు నిర్వర్తించకుంటే చర్యలు

### – ఏకలవ్య స్కూల్ ను తనిఖీ చేసిన కలెక్టర్

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వర్తించకుంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని రామవరం ప్రాంతంలో గల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ను కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు వండిన ఆహార పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించి అక్కడున్న సిబ్బందిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూమ్ లో నిల్వ కుళ్ళిన వంట పదార్థాలపై క్యాటరింగ్ అసిస్టెంట్ పై కలెక్టర్ అగ్రహం వ్యక్తం చేశారు.అనంతరం కలెక్టర్ అంకిత్ పాఠశాల ఆవరణలో ఉన్న డైనింగ్ హాలులో వంట వండుతున్న కుకింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. విద్యార్థుల కోసం వండిన వంటకాలను అన్నం పప్పు సాంబార్ రసం పెరుగు కోడిగుడ్లను రాత్రి భోజనం కోసం వంట చేసేందుకు సిద్ధం చేసుకున్న కాయగూరలను పరిశీలించి కుకింగ్ చేసే వంట మనిషితో హెల్పర్లతో మాట్లాడారు. ఎన్ని సంవత్సరాలుగా ఇక్కడ పనిచేస్తున్నారని నాణ్యతతో కూడిన పౌష్టికాహారం విద్యార్థులకు సిద్ధం చేసి అందజేయాలని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అప్పుడే విద్యార్థులతో పాటు పాఠశాల ఆవరణ ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.అదేవిధంగా డైనింగ్ హాల్ లో ఉన్న స్టోర్ రూమ్, ఆర్.ఓ.ఆర్ ప్లాంట్ ప్రాంతాలను తనిఖీ చేశారు. స్టోర్ రూమ్ లో ఉన్న కాయగూరలు ఉల్లిగడ్డ నిల్వ ఉన్న పప్పు దినుసులు బియ్యం సబ్బులు సరపు షాంపులు తదితర సామాగ్రిని ఎప్పుడు కొనుగోలుచేశారని ఎంతకాలం నుంచి నిల్వ ఉంచుతారని క్యాటరింగ్ అసిస్టెంట్ మంగిలాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో నిల్వ ఉన్న బెల్లం కుళ్ళి ఉండడాన్ని పరిశీలించి క్యాటరింగ్ అసిస్టెంట్ పై ఆగ్రహం వ్యక్తం చేసి



సక్రమంగా పనిచేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఏకలవ్య పాఠశాలలో వాచ్మెన్ గా పనిచేస్తున్న సుజాత తన సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్ళింది. విధులు నిర్వహించాలంటే సెక్యూరిటీ రూమ్ లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని సెక్యూరిటీ రూమ్ నిర్మించేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసింది. అదేవిధంగా పాఠశాలకు రావాలంటే విద్యార్థులు ఉపాధ్యాయ సిబ్బంది సరైన రోడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని అంతర్గత రోడ్లు పరిస్థితి మరీ దారుణమని పలు సమస్యలు జిల్లా కలెక్టర్ కు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట కొత్తగూడెం తహసిల్దార్ పుల్లయ్య, రెవెన్యూ సిబ్బంది బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

### – భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం): గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. మంగళవారం ఐడీఓసీ సమావేశపు హాలులోవినాయక చవితి నవరాత్రి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై సమావేశం జరిగింది. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్ని గణేష్ మండపాలను తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం ముందస్తుగా గణేష్ మండలి నిర్వాహకులు పూర్తి వివరాలు అందించాలని ఇది ఉత్సవాలను మరింత వైభవంగా నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలు మండల స్థాయిలో గణేష్ ఉత్సవాల నిర్వహణపై పోలీస్ రెవెన్యూ ఇతర శాఖల అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు సమావేశాలు నిర్వహించాలని పేర్కొన్నారు. గణేష్ నవరాత్రి ఉత్సవాలు మొదటి రోజు నుండి నిమజ్జనం వరకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రశాంత వాతావరణంలో అవాంచనీయ సంఘటనలు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.మండపాలకు విద్యుత్ ఏర్పాటుకు తప్పని సరిగా విద్యుత్ శాఖ నుండి అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలుపై విద్యుత్ అధికారులు మండపాల్లో ఆడిట్ నిర్వహించాలని సూచించారు. విద్యుత్ తీగలకు తగల కుండా ఎత్తు తక్కువ ఉండే విగ్రహాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల్లో మైక్ ఏర్పాటుకు పోలీస్ శాఖ అనుమతి తీసుకోవాలని తెలిపారు.భద్రాద్రి జిల్లా నుండే కాకుండా ఇతర రాష్ట్రాలు జిల్లాల నుండి నిమజ్జనానికి విగ్రహాలు వచ్చే అవకాశం ఉన్నందున యంత్రాంగం సూచించిన ప్రాంతాల్లో మాత్రమే అత్యంత భద్రత మధ్య నిమజ్జన కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తెలియజేసారు. గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ప్రణాళికరూపొందించుకోవాలని విగ్రహాలను నిమజ్జనం చేసుకునేందుకు అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కోరారు. నిమజ్జనం రూట్ లో అవసరమైన రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలను ముందస్తుగా రవాణాశాఖ అధికారి నుండి ధ్రువీకరణ తీసుకోవాలన్నారు.ప్రతి గణేష్ మండపం వద్ద అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేయాలని గణేష్ నిమజ్జనం సజావుగా జరిగే విధంగా కట్టు దిట్టమైన భద్రత వ్యవస్థ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా భక్తిపాటలు మాత్రమే వినిపించాలని మతాలు వర్గాల మనోభావాలను గౌరవించాలని పేర్కొన్నారు. అధికారులు ఉత్సవ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని గణేష్ ఉత్సవాలు నిమజ్జనం సందర్భంగా ఎలాంటి రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లవద్దని శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ గణేష్ నిమజ్జనం సందర్భంగా క్రేన్లు వినియోగించాలని గణేష్ నిమజ్జనం జరిగే ప్రదేశాలలో గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని తెలిపారు. కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల సహకారంతో కలిసికట్టుగా పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని అన్నారు. భక్తులకు అందించే స్వామి వారి ప్రసాదాలకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని తెలిపారు. వ్యర్థాలు వేసేందుకు డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలని రసాయనాలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ తో చేసే విగ్రహాలు పర్యావణానికి హాని కలిగిస్తాయన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో ఉచిత మట్టిగణపతులు పంపిణీ చేయనున్నామని ప్రజలు మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వేణుగోపాల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాళ్ శ్రేష్ఠ, డీ.ఆర్.ఓ పద్మావతి, డీ.టీ.ఓ వెంకట రమణ, జిల్లా ఇంచార్జ్ ఎక్సైజ్ ఈ.ఎస్ జానయ్య, జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి క్రాంతి కుమార్, డీ.ఎం.హెచ్.ఓ డాక్టర్ తుకారాం రాథోడ్, విద్యుత్ శాఖ ఎస్.ఈ మహేంద్ర, కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ కమిషనర్ సుజాత, ఐటీసీ, సింగరేణి సంస్థ ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కొత్తగూడెం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యెర్రా కామేష్, సభ్యులు దారా రమేష్, లక్ష్మణ్, వందనపు శ్రీధర్, మహేష్, సుజాత, విజయలక్ష్మి, యాకయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా ఎల్ఎన్ఎస్ జువెలర్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు

ఎల్ బి నగర్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 1: కర్మన్‌ఘాట్ శ్రీ హనుమాన్‌నగర్‌కాలనీలోని ఎల్ఎన్ఎస్ జువెలర్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్లను నిర్వాహకులు ప్రకటించారు. సెప్టెంబర్ 1 నుంచి 14వ తేదీ వరకు



ఈ ఆఫర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.ఎల్ఎన్ఎస్ జువెలర్స్ నిర్వాహకులు అల్లంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకుడు మధు యాష్కీగౌడ్ హాజరయ్యారు. ఇదే సందర్భంగా అల్లంపల్లి శ్రీనివాస్ జన్మదిన వేడుకలను కూడా నిర్వహించారు. మధు యాష్కీగౌడ్ సమక్షంలో కేక్‌కట్ చేసి శ్రీనివాస్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరంఅల్లంపల్లి శ్రీనివాస్‌నుశాలువాతో సత్కరించిన మధు యాష్కీగౌడ్ ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఎన్ఎస్ జువెలర్స్ సిబ్బంది, కుటుంబ సభ్యులు, స్నేహితులు, స్థానిక ప్రముఖులు పాల్గొని శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.రూ.లక్షకొనుగోలుపై లక్కీ డ్రా కూపన్‌వార్షికోత్సవ ప్రత్యేక ఆఫర్‌లో భాగంగా రూ.లక్షకు పైగా విలువైన బంగారు ఆభరణాలు కొనుగోలు చేసే వినియోగదారులకు లక్కీ డ్రా కూపన్ అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.లక్కీ డ్రాలో ఒక విజేతకు ద్విచక్ర వాహనం, మరో విజేతకు ల్యాప్‌టాప్, 100 మంది విజేతలకు రైస్ ప్రెజర్‌కుక్కర్లు బహుమతులుగా అందించనున్నట్లు వెల్లడించారు. సెప్టెంబర్ 15వ తేదీ సాయంత్రం 6 గంటలకు లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.నాణ్యత,నమ్మకం, పారదర్శకతకు ప్రాధాన్యమిస్తూ వినియోగదారులకు సేవలందిస్తున్న ఎల్ఎన్ఎస్ జువెలర్స్ వార్షికోత్సవ ప్రత్యేక ఆఫర్లను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో లింగోజిగూడ మాజీ కార్పొరేటర్ ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, పాశం అశోక్‌గౌడ్, బుడ్డా సత్యనారాయణ, అయిత గోని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బంధం

బంధం ఎలా ఉండాలంటే
నన్ను తమవాడిగా చేసుకోగలగాలి
నా దుఃఖాన్ని తెలుసుకోగలగాలి
జోరుగా కురిసే వర్షంలో సైతం
నా కన్నీళ్లను గుర్తించగలగాలి
నా నవ్వు వెనుక దాగిన బాధను చదవగలగాలి
నా మౌనం వెనుక ఉన్న మాటను వినగలగాలి
నేను చెప్పకముందే నా అవసరాన్ని గమనించగలగాలి
నా అడుగుల్లో అలసటను అర్థం చేసుకోగలగాలి
నా ఓటమిలో సైతం నా గెలుపును చూడగలగాలి



ప్రపంచమంతా నన్ను తప్పుపట్టినా
నిజం తెలుసుకునే వరకు నా వెంట నిలవగలగాలి
కాలం మారినా మనసు మారకూడదు
దూరం పెరిగినా దూరం అనిపించకూడదు
కనిపించకపోయినా మనసుకు దగ్గరగా ఉండగలగాలి
నా కన్నీటికి కారణం అడగకముందే
ఆ కన్నీటిని తుడిచే చేయి కావాలి
నా గుండె గాయాన్ని గుచ్చకుండా
మమతతో మందులా మాట చెప్పాలి
నా బలహీనతను బహిర్గతం చేయకుండా
నా బలంగా మారే తోడుగా నిలవాలి
అవసరంలో మాత్రమే గుర్తొచ్చే బంధం కాదు
ఆపదలో ముందుగా గుర్తొచ్చే బంధం కావాలి
సంతోషాన్ని పంచుకోవడమే కాదుబాధను కూడా సగం చేసుకునే
బంధం కావాలి
రక్తంతో కాదు? మనసుతో కలిసిన బంధం కావాలి
జీవితం చివరి వరకు నిలిచే నమ్మకమైన బంధం కావాలి
అదే నిజమైన బంధం? అదే మనసుకు మిగిలే అనుబంధం!
రచన : రేవెల్లి పద్మ శివాని జూనియర్ కాలేజ్, హన్మకొండ.

# పోరాటాలతోనే కార్మిక వర్గానికి మనుగడ

భద్రాద్రి కొత్తగూడెం(జ్యోతి ప్రభంజనం):సంఘటిత పోరాటాలతోనే కార్మిక వర్గానికి మనుగడని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్ టియు) జాతీయ ఉపాధ్యక్షులు సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.అనురాధలు అన్నారు.మంగళ వారం సిఈఆర్ క్లబ్‌లో ఐఎఫ్ టియు జిల్లా అధ్యక్షులు కొక్కు సారంగ పాణి అధ్యక్షతన జిల్లా సదస్సు జరిగింది. ఈ సదస్సులో సాధినేని, అనురాధలు మాట్లాడు తూ కార్మికులు చేసిన ఎన్నెన్నో పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేవలం అంబానీ అదాని లాంటి కార్పొరేట్ సంస్థలు కార్మికుల రక్త మాంసాలను జుర్రుకునేందుకు వారి సంపదలను పెంచేందుకు నాలుగు లేబర్ కోడ్లను తీసుకుని వచ్చారన్నారు. నాలుగు లేబర్ కోడ్లు దేశ కార్మికవర్గం మనుగడకు ఉరితాడు లాంటి వని అన్నారు. 29 కార్మికచట్టాల రద్దు దాని స్థానంలో తెచ్చిన లేబర్ కోడ్లు కార్పొరేట్లకు కార్మిక వర్గాన్ని తాకట్టు పెట్టడమేనని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులు సంఘటిత పోరా టాలు చేయాలని అన్నారు.మోడి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలపై డిల్లీ గురుగావ్, నోయిడా, మానేసర్ లో ప్రారంభమై ఉత్తర ప్రదేశ్, హర్యానా,బీహార్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో నాలుగు లేబర్ కోడ్లపై కార్మికవర్గం చేసిన వీరోచిత ఉద్యమాలను స్ఫూర్తిగా చేసుకొని దేశకార్మిక వర్గం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. ఐఎఫ్టి యు జిల్లా కార్యదర్శిజే.సీతారామయ్య మా ట్లాడుతూ రాష్ట్రంలో అసంఘ టితరంగ సంఘటిత రంగనీలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదని అన్నారు. మున్సిపల్, జిపి అంగన్వాడి ఆశా కేజిబివి భవననిర్మాణ స్కీంఆటో మోటార్ సింగరేణి విద్యుత్ బిపిఎల్ నవభారత్ తదితర విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పరిస్థితి కడుదుర్మార్గంగా ఉందని అన్నారు. కనీస వేత నాలు చట్టబద్ధ సౌకర్యాలు అమలుకు నోచుకోవడం లేదని పనిస్థలాల్లో కనీస రక్షణ చర్యలులేవని మహిళా కార్మికులపై లైంగిక వేధింపులు జరుగుతున్నప్పటికీ రాజకీయ నేతల అండదండలతో నేరస్థులు కాపాడబడు తున్నారని అన్నారు. సదస్సులో ఐఎఫ్టియు జిల్లా నాయకులు ఎండి.రాసుద్దిన్, తోడేటి నాగేశ్వరరావు, గౌనినాగేశ్వరరావు, ఎన్.సంజీవ్, కొండపల్లి శ్రీనివాస్, మోత్కూరి మల్లికార్జున్, బి.వెంకటమ్మ తదితరులు ప్రసంగించారు.కార్మిక ప్రదర్శన..సదస్సు అనంతరం సి ఈఆర్ క్లబ్ నుండి పోస్ట్రాఫీస్ సెంటర్ మీదుగా బస్టాండ్ వరకు కార్మికుల ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో ఐఎఫ్టియు జిల్లానాయకులు కాపుకృష్ణ, జి.సంజీవరావు,వాసు,శరత్,మంకెన వెంకటే శ్వర్లు,రావూరి ఉపేందర్ రావు,మోహన్ రావు,నర సింహా రావు, సామేల్, కొప్పులశ్రీనివాస్,యాసారపువెంకన్న, గడ్డంనాగేష్, పందిళ్ళపల్లి వీరన్న, సాధనపల్లి రవి సానుగుల వెంకన్న, మూడుబిచ్చు తదితరులు పాల్గొన్నారు.



# భ్రమ

చీకటిని చూసి భయపడొద్దు
వెలుతురుని చూసి మురిసిపోవద్దు
రెండూ శాశ్వతమనుకోవడమే భ్రమ
కన్నీరు వస్తే కుంగిపోవద్దు
నవ్వు వస్తే పొంగిపోవద్దు



రెండూ నిలిచిపోతాయనుకోవడమే భ్రమ
ఓటమి ఎదురైతే అంతమని అనుకోవద్దు
విజయం దక్కితే శిఖరమని అనుకోవద్దు
కాలచక్రం ఆగిపోతుందనుకోవడమే భ్రమ
మనవాళ్లు అనుకున్నవాళ్లు మారవచ్చు
పరాయివాళ్లు అనుకున్నవాళ్లు చేరవచ్చు
మనుషులు ఎప్పటికీ ఒకేలా ఉంటారనుకోవడమే భ్రమ
డబ్బు ఉంటే బంధాలు ఉంటాయనుకోవద్దు
డబ్బు పోతే బంధాలు పోతాయనుకోవద్దు
ధనమే మనిషి విలువనుకోవడమే భ్రమ
నేడు నీ చేతిలో ఉన్న అధికారంరేపు మరొకరి చేతిలో ఉండవచ్చు
అధికారం శాశ్వతమని భావించడమే భ్రమ
నీ నీడ కూడా వెలుతురు ఉన్నంతవరకే
నీ వెంట నడుస్తుందని గుర్తుంచుకో
ప్రతి తోడు శాశ్వతమనుకోవడమే భ్రమ
జీవితం ఇచ్చిన ప్రతి గాయం
ఒక కొత్త పాఠంగా మారుతుంది
బతుకే మన చేతుల్లో ఉందనుకోవడమే భ్రమ
నిన్న అనేది తిరిగిరాని జ్ఞాపకం
రేపు అనేది తెలియని ప్రశ్న
ఈ క్షణమే శాశ్వతమనుకోవడమే భ్రమ
చివరికి మనం దాచుకున్నదేదీ మనది కాదు
మనతో వచ్చేది ఏదీ లేదు
మనతో వెళ్లేది ఏదీ లేదు
ఈ బతుకంతా ఒక అందమైన భ్రమ!

రచన : కె.మురళీమోహన్ రాజు, నెల్లూరు.చరవాణి : 9866179385

# ఇకపై అన్ని రకాల ఎరువులు ఒకే యాప్ ద్వారా సరఫరా

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 01(జ్యోతి ప్రభంజనం): రైతులకు ఎరువుల సరఫరాను మరింత పారదర్శకంగా నిర్వహించడంతో పాటు విక్రయాలను డిజిటల్ విధానంలో పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్ వ్యవస్థ చిట్యాల మండలంలో సెప్టెంబర్ 2 నుంచి అమల్లోకి రానుందని చిట్యాల మండల వ్యవసాయ అధికారి పగిడిమర్రి గిరిబాబు మంగళవారం తెలిపారు.ప్రస్తుతం తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎరువుల యాప్ ద్వారా ప్రధానంగా యూరియా విక్రయాలను పర్యవేక్షిస్తూ రైతులకు అందజేస్తున్నారని తెలిపారు. ఇతర ఎరువులను యాప్‌తో సంబంధం లేకుండా రైతులకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. ఇకపై కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ఈఈూ వ్యవస్థలో యూరియాతో పాటు డీఏపీ,ఎంఓపీ,అన్ని రకాల కాంప్లెక్స్ ఎరువులు కూడా డిజిటల్ విధానంలో నమోదు చేసి రైతులకు సరఫరా చేయనున్నట్లు వివరించారు. విక్రయాలపై డిజిటల్ పర్యవేక్షణకొత్త విధానం అమల్లోకి వచ్చిన తర్వాత ఎరువుల డీలర్లు, విక్రయ కేంద్రాల వద్ద జరిగే లావాదేవీలు ఒకే డిజిటల్ వ్యవస్థలో నమోదవుతాయని గిరిబాబు తెలిపారు. దీంతో ఎరువుల



నిల్వలు, సరఫరా, విక్రయాలపై అధికారులు మరింత సమర్థవంతంగా పర్యవేక్షణ చేసే అవకాశం ఉంటుందన్నారు.రైతులకు అవసరమైన ఎరువులు సక్రమంగా అందేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు. ఎరువుల కృత్రిమ కొరత, అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయించడం వంటి అంశాలను నియంత్రించేందుకు డిజిటల్ పర్యవేక్షణ దోహదపడుతుందని పేర్కొన్నారు.రైతులు సహకరించాలి విధానం అమలులోకి వచ్చిన నేపథ్యంలో రైతులు ఎరు వుల కొనుగోలు సమయంలో తమకు సంబంధించిన వివరా లు, అవసరమైన రైతు గుర్తింపు వివరాలను అందుబాటులో ఉంచుకోవాలని గిరిబాబు సూచించారు. ఎరువుల విక్రయాల్లో కొత్త విధానం కారణంగా ప్రారంభ దశలో ఎదురయ్యే సందేహాలను రైతులు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని కోరారు.మండలంలో ఈఈూ విధానం సజావుగా అమలయ్యేలా ఎరువుల విక్రయ కేంద్రాల నిర్వాహకులకు అవసరమైన అవగాహన కల్పిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి తెలిపారు.

# బీజేపీ నాయకుల పై దాడులు తగవు.

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 01(జ్యోతి ప్రభంజనం):బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ నాయకులు దాడి చేసి, కుటుంబ సభ్యులపై భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని బీజేపీ చిట్యాల మండల అధ్యక్షుడు పీక వెంకన్న ముదిరాజ్ అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.నల్లగొండలో బీజేపీ నాయకులపై జరిగిన దాడిని నిరసిస్తూ నల్లగొండకు వెళ్లేందుకు ప్రయత్నించిన బీజేపీ నాయకులను మంగళవారం చిట్యాల పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వెంకన్న మాట్లాడుతూ రాజకీయ విభేదాలు ఉంటే ప్రజాస్వామ్య పద్ధతిలో పరిష్కరించుకోవాలే తప్ప, నాయకుల ఇళ్లపై దాడులకు పాల్పడటం, కుటుంబ సభ్యులపై భౌతిక దాడులు చేయడం సమర్థనీయం కాదన్నారు. ఇలాంటి ఘటనలను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు.అనంతరం అరెస్టు చేసిన బీజేపీ నాయకులను పోలీసులు వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో బీజేపీ రాష్ట్ర నాయకుడు చికిలంమెట్ల అశోక్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు కూరెళ్ల శ్రీను, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు గంజి గోవర్ధన్, చిట్యాల మున్సిపాలిటీ అధ్యక్షుడు గుండాల నరేష్‌గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి నర్సింహ, పున్న విష్ణు, కంచర్ల శంకర్‌రెడ్డి, వైరాల రాహుల్, పిల్లి రవి, పాల శివకుమార్ తదితరులు ఉన్నారు.



# ఘనంగా శ్రీ జంట నాగేంద్ర స్వామి స్థిర ప్రతిష్ఠా మహోత్సవం

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 01:సైదాబాద్, రెడ్డి బస్తీలోని నాగులమ్మ దేవాలయంలో శ్రీ జంట నాగేంద్ర స్వామి స్థిర ప్రతిష్ఠా మహోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు త్రయాహ్నికంగా నిర్వహించిన ఈ ప్రతిష్ఠా మహోత్సవ వేడుకల్లో



వివిధ ఆధ్యాత్మిక,పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా భక్తుల కోసం అన్నదానం,సుప్రభాత సేవ, వేద పారాయణం, కలశ తీర్థం,యాగశాల ప్రవేశం,గణపతి పూజ, పుణ్యాహవాచనం,అఖండ దీప ప్రజ్వలన, రుత్విగ్వరణ,దీక్షాధారణ,మృత్సంగ్రహణం, అంకురార్పణ తదితర పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఘనంగా నాగులమ్మ పల్లకి సేవప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా దాతలు గడ్డమీది బాలకృష్ణ, ధర్మపత్ని అనసూయ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమంతో పాటు సాయంత్రం నాగులమ్మ పల్లకి సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెడ్డి బస్తీతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు, బస్తీ వాస్తవ్యులు హాజరై పల్లకి సేవలో పాల్గొన్నారు.భక్తులు నాగులమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మహోత్సవం సందర్భంగా ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.

# మందుబాబులకు కోర్టు షాక్.. రూ.1.67 లక్షల జరిమానా

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 31 మందికి శిక్షలు.. 17 మందికి ఒకరోజు సామాజిక సేవసెప్టెంబర్ 1: మద్యం సేవించి వాహనాలు నడిపిన వారికి న్యాయస్థానం జరిమానాతో పాటు సామాజిక సేవ శిక్ష విధించింది. మలక్‌పేట ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో భాగంగా మంగళవారం నాంపల్లిలోని ఎం.ఆర్. కాంప్లెక్స్‌లో ఉన్న 9వ జేఎంఎఫ్‌సీ కోర్టులో 31 కేసులు విచారణకు వచ్చి పరిష్కారమయ్యాయి. ఈ కేసుల్లో మొత్తం రూ.1,67,100 జరిమానా విధించారు.17 మందికి సామాజిక సేవపోలీసుల వివరాల ప్రకారం.. 31 కేసుల్లో 17 మందికి బీఏసీ 100 కంటే తక్కువగా, 14 మందికి 100 కంటే ఎక్కువగా నమోదైంది. వీరిలో నలుగురు రెండోసారి డ్రంక్ అండ్ డ్రైవ్‌కు పాల్పడినట్లు గుర్తించారు.కోర్టు ఆదేశాల మేరకు 17 మందికి ఒకరోజు కమ్యూనిటీ సర్వీస్‌తో పాటు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరుగుతుందని, ఇటువంటి చర్యలు వాహనదారుల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్‌పై అవగాహన కల్పించేందుకు దోహదపడతాయని పోలీసులు తెలిపారు.ద్విచక్ర వాహనాలే అధికంపరిష్కరించిన 31 కేసుల్లో 28 ద్విచక్ర వాహనాలు, రెండు మూడు చక్రాల వాహనాలు, ఒక నాలుగు చక్రాల వాహనం ఉన్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల తీవ్రత అధికంగా ఉండే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు.రూ.1.67 లక్షల జరిమానాకోర్టు విధించిన జరిమానా వివరాలు ఇలా ఉన్నాయి:× 28 కేసులు: ఒక్కొక్కరికి రూ.5,100 చొప్పున రూ.1,42,800× 2 కేసులు: ఒక్కొక్కరికి రూ.7,100 చొప్పున రూ.14,200× 1 కేసు: రూ.10,100మొత్తం: రూ.1,67,100మద్యం సేవించి వాహనం నడపడం డ్రైవర్ ప్రాణాలకే కాకుండా రోడ్డుపై ప్రయాణించే ఇతరుల భద్రతకు కూడా ముప్పుగా మారుతుందని పోలీసులు హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# ఎలికట్టెలో ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక.

చిట్యాల,నల్లగొండ: సెప్టెంబర్ 01(జ్యోతి ప్రభంజనం): మండలంలోని ఎలికట్టె గ్రామ ఎమ్మార్పీఎస్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు పొలిమెర దశరథ తెలిపారు.గ్రామ అధ్యక్షుడిగా పెరిక రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఉప్పలపల్లి నర్సింహ, ఉపాధ్యక్షులుగా ఉస్కిల బిక్షం, చుక్క సురేష్, చుక్క బిక్షం, అధికార ప్రతినిధిగా చుక్క కృష్ణ ఎన్నికయ్యారు. కార్యదర్శులుగా పెరిక సందీప్, పెరిక శివ, పెరిక సాయిగణేష్, సంయుక్త కార్యదర్శులుగా పెరిక విజయ్, పెరిక వెంకట్, పెరిక సైదులు ఎంపికయ్యారు.ప్రచార కార్యదర్శులుగా పిల్లి రాజు, పెరిక సుధాకర్, పెరిక రమేష్, సలహాదారులుగా చుక్క నర్సింహ, ఉష్కిల్ల బిక్షం, పిల్లి నర్సింహ, ఉస్కిళ్ల ఎల్లయ్య, పెరిక నర్సింహలను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు నాయకులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ఎరసాని గోపాల్, పెరిక లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



# గ్రామీణ ప్రాంతాల్లో 20 గ్రంథాలయాల ఏర్పాటు

చిట్యాల, నల్లగొండ: సెప్టెంబర్ 01(జ్యోతి ప్రభంజనం):గ్రామీణ ప్రాంతాల్లో విజ్ఞానాన్ని పెంపొందించడంతో పాటు పఠనాసక్తిని ప్రోత్సహించేందుకు విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 3న 20 గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించారు.హైదరాబాద్‌లోని శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ రియాజ్ తదితరులు ఈ గ్రంథాలయాలను వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.గత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో విజ్ఞానాన్ని పంచే గ్రంథాలయాలను ఏర్పాటు చేసే వారికి ఓటు వేయాలని, అలాంటి గ్రామాలకు విపంచి ఫౌండేషన్ తరఫున పుస్తకాలు, గ్రంథాలను అందజేస్తామని ఇచ్చిన పిలుపునకు రాష్ట్రవ్యాప్తంగా మంచి స్పందన లభించిందన్నారు. ఇందులో భాగంగానే తొలిదశలో 20 గ్రామాల్లో గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేస్తున్నట్లు అనుముల శ్రీనివాస్ తెలిపారు. గ్రామీణ యువత, విద్యార్థులకు గ్రంథాలయాలు విజ్ఞాన కేంద్రాలుగా ఉపయోగపడతాయని ఆయన అన్నారు.



# మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలి

రంగారెడ్డి జిల్లా, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 01:మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని డిమాండ్ చేస్తూ మహేశ్వరం మండల ఫ్యూచర్ సిటీ జేఏసీ ఆధ్వర్యంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షకు సంఘీభావం తెలిపిన. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, టీపీసీసీ సభ్యులు దేప భాస్కర్ రెడ్డి ఈ సందర్భంగా దేవ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలన్నది ఈ ప్రాంత ప్రజల చిరకాల ఆకాంక్ష అని అన్నారు. ఫ్యూచర్ సిటీ ఏర్పాటు ద్వారా మహేశ్వరం ప్రాంతానికి పెద్ద ఎత్తున అభివృద్ధి అవకాశాలు లభించనున్న నేపథ్యంలో, మండలంలోని కొన్ని గ్రామాలను మాత్రమే కాకుండా మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను సమగ్రంగా ఫ్యూచర్ సిటీ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫ్యూచర్ సిటీ జేఏసీ అధ్యక్షులు రఘుపతి, కాకి ఈశ్వర్ ముదిరాజ్,చిక్కుళ్ల శివప్రసాద్,దత్తు, జేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.




# జైలు గోడల మధ్య సంగీతం.. కొత్త ఆశలకు ఊపిరి

## 'స్వర సాధన' సంగీత విభావరితో మహిళా ఖైదీల్లో ఆనందం, ఆత్మవిశ్వాసం

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 01: జైలు గోడల మధ్య సంగీత స్వరాలు సరికొత్త ఉత్సాహాన్ని నింపాయి. నిరాశ, ఒత్తిడితో గడిపే మహిళా ఖైదీలకు మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు వారిలో ఆశ, ఆత్మవిశ్వాసం, సానుకూల ఆలోచనలను పెంపొందించే లక్ష్యంతో హైదరాబాద్ ప్రత్యేక మహిళా జైలులో సోమవారం 'స్వర సాధన' సంగీత విభావరి నిర్వహించారు.తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ డీజీ డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్ ఆహ్వానం మేరకు 'స్వర సాధన' సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హిందుస్థానీ శాస్త్రీయ సంగీతం, లలిత సంగీతం, గజల్స్‌తో కళాకారులు అలరించారు. సంగీత



ప్రదర్శనలకు మహిళా ఖైదీలు ఉత్సాహంగా స్పందించి కళాకారులతో కలిసి పాటలు పాడారు. దీంతో జైలు ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది.సంగీతాన్ని ఆస్వాదించిన పలువురు మహిళా ఖైదీలు తమ అనుభూతిని పంచుకున్నారు. పాటలు వింటున్నంతసేపు జైలు గోడలను మరచిపోయి, బయట ప్రపంచంలో ఉన్నట్లుగా అనిపించిందని తెలిపారు. సంగీతం తమలో ప్రశాంతత, ఆనందం, స్వేచ్ఛాభావనను కలిగించిందని చెప్పారు.ఖైదీల్లో మానసిక ఉల్లాసాన్ని పెంచడంతో పాటు, తమ జీవితాలను సానుకూల దిశలో మలుచుకోవాలనే ఆలోచనలకు ఈ కార్యక్రమం బాటలు వేసింది.సరితా దబ్రీవాల్ స్థాపించిన 'స్వర సాధన' సంస్థ సంగీత కళాభివృద్ధితో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. గజల్ గాయని దేవి రామనమూర్తి మార్గదర్శకత్వంలో సంస్థ పలు కార్యక్రమాలను చేపడుతోంది. ఈ కార్యక్రమంలో 83 ఏళ్ల సీనియర్ శిష్యురాలు వల్లీ సుబ్రహ్మణ్యం, లలితా ఆనంద్, పునీతా లాథ్, వందన శెట్టి తమ గానంతో ఆకట్టుకున్నారు. వారికి తబలాపై




నజ్ముద్దీన్ జావెద్, కీబోర్డుపై రఫీ బక్ష్ సహకారం అందించారు.జైలు .. శిక్షా కేంద్రాలే కాదు, సంస్కరణ కేంద్రాలుఈ సందర్భంగా డీజీ జైళ్లు డా. సౌమ్య మిశ్రా మాట్లాడుతూ.. సంగీతానికి మనసులను కలిపే శక్తి ఉందన్నారు. ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను అందించడంతో పాటు ఆశ, ఆనందాన్ని నింపగల శక్తి సంగీతానికి ఉందని పేర్కొన్నారు.జైళ్ల శాఖ బాధ్యత కేవలం ఖైదీల భద్రత, సంరక్షణకే పరిమితం కాదని.. వారిలో మార్పు తీసుకురావడం, పునరావాసం కల్పించడం, తిరిగి సమాజంలో గౌరవప్రదంగా జీవించేలా చేయడం కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు.సాంస్కృతిక, కళా, సంగీత కార్యక్రమాలు ఖైదీలలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. "గతాన్ని తలచుకుని నిరాశ చెందకుండా.. ప్రతి రోజును కొత్త ఆరంభంగా భావించాలి'' అని మహిళా ఖైదీలకు సూచించారు.మహిళా ఖైదీల కోసం తమ సమయాన్ని, ప్రతిభను



కేటాయించిన 'స్వర సాధన' నిర్వాహకులు, గాయకులు, సంగీత కళాకారులను డీజీ ప్రత్యేకంగా అభినందించారు.కార్యక్రమంలో ప్రత్యేక మహిళా జైలు సూపరింటెండెంట్ లక్ష్మీ శ్రీనాథ్, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ప్రిజన్స్ బి. అమరావతి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేరగాళ్ల గుర్తింపులో ఇక మరింత కచ్చితత్వం

## తెలంగాణ జైళ్లలో సీఆర్‌పీఐ వ్యవస్థకు శ్రీకారం.. సికాలో అధికారులకు శిక్షణ

హైదరాబాద్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి, సెప్టెంబర్ 1: నేర పరిశోధనలో సాంకేతికతను మరింత సమర్థవంతంగా వినియోగించేందుకు తెలంగాణ జైళ్ల శాఖ సన్నద్ధమవుతోంది. జైళ్లలో క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్)?సీఆర్‌పీఐ వ్యవస్థ అమలు, నిర్వహణపై అధికారులు, సిబ్బందికి చంచల్‌గూడలోని స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌కరెక్షనల్ అడ్మినిస్ట్రేషన్ (సికా)లో మంగళ వారం మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. తెలంగాణ జైళ్లు, కరెక్షనల్ సర్వీసెస్ డీజీ డా. సౌమ్య మిశ్రా, ఐపీఎస్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సెప్టెంబర్ 1 నుంచి 3 వరకు జరిగే శిక్షణను కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ), సీ–డాక్ కోల్‌కతా సాంకేతిక నిపుణుల సహకారంతో నిర్వహిస్తున్నారు.బయోమెట్రిక్ సమాచారంతో గుర్తింపు2022లో అమల్లోకి వచ్చిన క్రిమినల్ ప్రొసీజర్ (ఐడెంటిఫికేషన్) చట్టం ఆధారంగా సీఆర్‌పీఐ వ్యవస్థను రూపొందించారు. గతంలో అమల్లో ఉన్న 1920 నాటి ఐడెంటిఫికేషన్ ఆఫ్ ప్రిజనర్స్ యాక్ట్ స్థానంలో ఈ ఆధునిక విధానం వచ్చింది.సీఆర్‌పీఐ ద్వారా ముఖం, ఐరిస్, డీఎన్‌ఏ వంటి బయోమెట్రిక్ సమాచారాన్ని నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సేకరించి భద్రపరచవచ్చు. జాతీయ స్థాయిలోని డేటాబేస్‌తో సమాచారాన్ని సరిపోల్చడం ద్వారా అధీకృత దర్యాప్తు సంస్థలకు వ్యక్తుల గుర్తింపు, నేర పరిశోధనలో మరింత వేగం, కచ్చితత్వం లభించనుంది.14 జైలు ఆన్‌బోర్డ్‌సీఆర్‌పీఐ అమలుకు అవసరమైన మౌలిక వసతులను రాష్ట్రంలోని జైళ్లలో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే 14 జైళ్లు వ్యవస్థలో ఆన్‌బోర్డ్ కాగా, మరో 21 జైళ్లను అనుసంధానించే ప్రక్రియ కొనసాగుతోంది.జైళ్లలో మెటీరియల్ కలెక్షన్ యూనిట్ (ఎంసీయూ) క్యూబికల్స్ ఏర్పాటు చేయనున్నారు. శిక్షణ పొందిన సిబ్బంది వీటి ద్వారా బయోమెట్రిక్ సమాచారాన్ని ఎన్‌సీఆర్‌బీ నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా సేకరించనున్నారు.డిజిటల్ జైలు పరిపాలనకు బలండీజీ సౌమ్య మిశ్రా మాట్లాడుతూ ఆధునిక నేర న్యాయ వ్యవస్థలో సాంకేతిక పరిజ్ఞానం కీలకమన్నారు. వ్యక్తుల గుర్తింపులో కచ్చితత్వాన్ని పెంచడంతో పాటు వివిధ విభాగాల మధ్య సమాచార మార్పిడి, సమన్వయాన్ని మెరుగుపరచడంలో సీఆర్‌పీఐ ఉపయోగపడుతుందని తెలిపారు.జైళ్ల శాఖను డిజిటల్‌గా బలోపేతం చేయడంతో పాటు విస్తృత నేర న్యాయ వ్యవస్థతో అనుసంధానాన్ని మెరుగుపరచేందుకు ఈ వ్యవస్థ ఒక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు.136 మందికి శిక్షణమూడు రోజుల కార్యక్రమంలో మొత్తం 136 మంది అధికారులు, సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. తొలిరోజు ఎస్పీ క్యాడర్ నుంచి డిప్యూటీ జైలర్ స్థాయి వరకు 34 మంది అధికారులు పాల్గొన్నారు.ఎన్‌సీఆర్‌బీ సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ అనుపమ్ కుర్మాకర్ సీఆర్‌పీఐ చట్టం లక్ష్యాలు, బయోమెట్రిక్ సమాచార సేకరణ, నేర పరిశోధనలో వ్యవస్థ వినియోగంపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ ఎన్. మురళీబాబు, డీఐజీ ఎం. సంపత్, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎన్‌సీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్. రమేష్, సీ–డాక్ కోల్‌కతా ప్రాజెక్ట్ ఇంజనీర్లు పి. అమోఘ్, శుభమ్ అనిల్ తీర్థకర్ సాంకేతిక సహకారం అందిస్తున్నారు.








# ఘనంగా ఎల్ఐసి 70 వ వార్షికోత్సవ వేడుకలు

చౌటుప్పల్, జ్యోతి ప్రభంజనం, ప్రతినిధి,సెప్టెంబర్ 01:భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ ఐ సి )70 వ వార్షికోత్సవ వేడుకలు సౌత్ జోనల్ కార్యాలయం లో మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ప్రధాన కార్యాలయంలో జోనల్ మేనేజర్ శ్రవణ్ రమేష్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు ప్రారంభమయ్యాయి, ఈ వేడుకలకు ప్రముఖ వ్యాపారవేత్త వాసవి కన్స్ట్రక్షన్స్ చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ యర్రం విజయకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాలకు చెందిన రీజనల్ మేనేజర్లు, అధికారులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఎల్ఐసి కి విలువైన పాలసీదారుడుగా ఎన్నో సంవత్సర సంవత్సరాలుగా అనుబంధం ఉన్న ఎర్రం విజయ్ కుమార్ మాట్లాడుతూ త్వరలో శతాబ్ది ఉత్సవాలను జరుపుకునే విధంగా ముందుకు సాగాలని కోరుకుంటున్నాను అని విజయ్ కుమార్ తెలిపారు. ఎల్ఐసి అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న ఉ ద్యోగులు, మార్కెటింగ్ ఏజెంట్లు, డెవలప్మెంట్ ఆఫీసర్లను, ఎల్ఐసి ఏజెంట్లను ఆయన అభినందించారు. ఎల్ఐసి గ్యారెంటీకి,విశ్వాసానికి, పవిత్రతకు, ఆర్థిక భద్రతకు ప్రత్యేకంగా నిలిచిన సంస్థ ఎల్ఐసి అని ఆయన తెలిపారు. పిల్లల భవిష్యత్తుకు, విద్యాభ్యాసం, ఉన్నత విద్యా, వివాహం, కుటుంబార్థిక భద్రతకు, పదవి విరమణ అనంతరం ఎల్ఐసి ఎంతో అవసరమని చెప్పారు. ఎల్ఐసి 70 వార్షికోత్సవం సందర్భంగా దేశవ్యాప్తంగా సందర్భం సేవలు అందిస్తున్న తెలియజేశారు.అదేవిధంగా జీవిత బీమా సంస్థను విశ్వసించే తమ కష్టార్జిత సంపాదనను పొదుపుగా భద్రత పొందుతున్న కోట్లాదిమంది పాలసీదారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.కౌటికే విఠల్ మాట్లాడుతూ ఎల్ఐసి సంస్థలు నిజమైన బలం అసలైన ముఖచిత్రం జీవిత బీమా అని కౌటికె విటల్ తెలిపారు. ఏజెంట్లు సంతృప్తిగా ఉత్సాహంగా పనిచేసినప్పుడే సంస్థ మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందని ఆయన తెలిపారు.





printed and published by **Rapolu Lingaswamy**,onbehalf of printed at **SMILYS ONLINE** 6-7-48, Vanasthali Puram Shoping Complex, Dist:Rangareddy,stete:Telangana **Editor: Rapolu Lingaswamy.pone:9908103501,** PRGI **NO:TGTEL/26/A6501 Email: rapolulingaswamy01@gmail.com**